


# కరపత్రం

SINCE 2014


శుక్రవారం అక్టోబర్ 25 2024 | సంపుటి :0 | సంచిక : 17 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


## కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో నిర్మాణాలు

- నెహారెడ్డి తదితరులపై చర్యలు తీసుకున్నారో చెప్పండి
- విశాఖ గ్రేటర్ మున్సిపల్ అధికారులకు హైకోర్టు ప్రశ్న



**వేకువసమయం ప్రతినిధి**

విశాఖ జిల్లా భీమిలిపట్నం పరిధిలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టిన వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి కుమార్తె నెహారెడ్డి ఇతర బాధ్యులపై ఏం చర్యలు తీసుకున్నారని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఏపీ హైకోర్టు ప్రశ్నించింది.

## రాహుల్ ఆలోచనలకు భిన్నంగా రాష్ట్ర కాంగ్రెస్



- ఫిరాయింపులను ప్రోత్సహించడం ఆశ్చర్యం
- ఫిరాయించిన వారికే ప్రత్యేక గుర్తింపు
- పోచారం శ్రీనివాసరెడ్డికి సలహాదారు పదవా
- ఎఐసిసికి రాసిన లేఖలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆవేదన

**వేకువసమయం ప్రతినిధి**

కేసీఆర్‌లాగే కాంగ్రెస్.. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం పట్ల ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారని అంటూ ఎఐసిసికి రాసిన లేఖలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనలకు భిన్నంగా పార్టీ నడుస్తోందని తెలిపారు. పార్టీ ఫిరాయించిన వారికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వబడుతుందనే అభిప్రాయాన్ని కల్గించే విధంగా పార్టీ వ్యవహారం ఉన్నట్లు పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలతో పోచారం ఇంట్లో సమావేశం నిర్వహించడాన్ని ఎమ్మెల్సీ తీవ్రంగా తప్పుబట్టారు. ముఖ్య అనుచరుడి హత్యతో తీవ్ర మనోవేదనకు గురైనఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై కూడా అసహనాన్ని వ్యక్తం చేస్తూ పలు వ్యాఖ్యలు చేశారు.

2 లో

## చిన్నారులకు విద్యార్థి దశ నుంచే భారతీయ సంప్రదాయాలను అలవాటు చేయాలి:




భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చిన్నారులకు విద్యార్థి దశ నుంచే అలవాటు చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చిన్నారులకు విద్యార్థి దశ నుంచే అలవాటు చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. కాకర్ల సుబ్బారావు శతజయంతి వేడుకల్లో భాగంగా మాదాపూర్ శిల్పకళా వేదికపై ఇంటర్నేషనల్ స్కూల్ షేక్‌పేట్ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కిమ్స్ ఆసుపత్రి వ్యవస్థాపకులు భాస్కర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ చిన్నారులు ఫోన్లలకు అలవాటు పడి మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారని, వారిని వాటికి దురంగా ఉంచాలన్నారు. చిన్నారులకు ఏం నేర్పిస్తామో వాటినే అలవాటు చేసుకుంటారని చెప్పారు. ప్రస్తుతం విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అధికంగా ఉందన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అకట్టుకున్నాయి. కాకర్ల సుబ్బారావు వైద్య రంగంలో చేసిన కృషిని వివరిస్తూ విద్యార్థులు నాటికను ప్రదర్శించారు.

2 లో

# సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్..
# రూ.358 కోట్లు విడుదలకు భట్టి ఆదేశాలు




దీపావళి కానుకగా సింగరేణి కార్మికులకు బోనస్‌ను శుక్రవారమే చెల్లిస్తున్నామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సచివాలయంలో ప్రకటించారు. దీని కోసం సింగరేణి సంస్థ రూ.358 కోట్లను విడుదల చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌ను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సింగరేణిపై జరిగిన సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది చెల్లించిన దీపావళి బోనస్ కన్నా ఇది రూ.50 కోట్లు అధికం కావడం విశేషం. శుక్రవారం మధ్యాహ్నం సమయానికి దీపావళి బోనస్‌ను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. దీపావళి బోనస్ కింద ఒక్కొక్క కార్మికుడు రూ.93,750లు అందుకోనున్నారు. సంస్థలో పనిచేస్తున్న దాదాపు 40,000 మంది కార్మికులకు ఈ బోనస్ అందనుంది.

బొగ్గు పరిశ్రమ కోసం జేబీసీసీఐ విధానాల్లో భాగంగా కంపెనీలు సాధించిన ఉత్పత్తి పరిమాణం ఆధారంగా కార్మికుల శ్రమకు ప్రోత్సాహకంగా ఈ బోనస్‌ను చెల్లించే పద్ధతి గత కొన్నేళ్లుగా అమలులో ఉంది. ఈ ఏడాది కూడా కోల్ ఇండియా స్థాయిలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా దీపావళి పండుగకు ముందే చెల్లింపులు జరిగేలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలిచ్చారు. ఇటీవలే సింగరేణి ఉద్యోగులందరికీ 33 శాతం లాభాల వాటా కింద రూ.796 కోట్లను కంపెనీ పంపిణీ చేసిందని సింగరేణి సీఎండీ తెలిపారు.




## రాష్ట్ర ప్రభుత్వం సహకరించకున్నా యాదాద్రికి MMTS సర్వీసు పొడిగింపు: కిషన్‌రెడ్డి




2 లో

**దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 90 శాతం రైల్వేలైన్ల విద్యుదీకరణ జరిగిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.**

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 90 శాతం రైల్వేలైన్ల విద్యుదీకరణ జరిగిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌తో రాష్ట్ర ఎంపీల సమావేశం అనంతరం రైల్ నిలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామన్నారు. వరంగల్‌లో రూ.650 కోట్లతో రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దక్షిణ మధ్య రైల్వే బడ్జెట్‌ను పెంచామన్నారు.దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 5 వందే భారత్ రైళ్లు ఉన్నాయని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు.



## ప్రజలు, రైతుల కోసం జైలుకు వెళ్లడానికి సిద్ధమే



- ఒకటి రెండేళ్లు జైలులో ఉండడానిఇ వెనకాడం
- కాంగ్రెస్ చీటింగ్‌పై అందరూ కలసికేసులు పెట్టాలి
- రైతుబంధు, రుణమాఫీ చేయనందుకు నిలదీయాలి
- ఆదిలాబాద్ సభలో పార్టీ శ్రేణులకు కెటిఆర్ పిలుపు

ఈ రాష్ట్ర ప్రజలు, రైతుల సంక్షేమం కోసం జైలుకు పోవడానికి కూడా రెడీగా ఉన్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. జైలుకు పోవడానికి రెడీ.. ప్రజలు, రైతుల కోసం ఒకట్రెండు ఏండ్లు జైల్లో ఉండేందుకు సిద్ధం. ఎవనీ అయ్యకు భయపడేది లేదు. తప్పకుండా కాంగ్రెస్‌ను ఉరికించి కొట్టే రోజులు దగ్గర పడ్డాయి. అసలు చీటింగ్ కేసులు ఎవరి మీద పెట్టాలి.. తులం బంగారం ఇస్తామని చెప్పి మోసం చేసిన ఈ చార్ సౌ బీస్‌గాని మీద కేసులు పెట్టాలి.

**జీవన్ రెడ్డి వ్యాఖ్యలను స్వాగతించిన వేముల**

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటేయాలని డిమాండ్

2 లో

**భవిష్యత్‌లో తెలంగాణలో సొంతంగా సీడ్ గార్డెన్ ఏర్పాటు :**

భవిష్యత్తులో తెలంగాణలోనే సొంతంగా సీడ్ గార్డెన్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

2 లో



## ప్రజలు, రైతుల కోసం జైలుకు వెళ్లడానికి సిద్ధమే

మొదటిపేజీ తరువాయి

రైతుబంధు ఎగ్గొట్టి, రుణమాఫీ చేయనందుకు రైతులు కేసులు పెట్టాలి. 2 లక్షల ఉద్యోగాలని చెప్పి.. ఇప్పటి వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వనందుకు యువత కేసులు పెట్టాలి. ఇలా అన్ని వర్గాలు పోలీసు స్టేషన్ల ముందు లైన్లు కట్టి చీటింగ్ కేసు పెడితే ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా ఈ రాష్ట్రంలో మిగలడు అని కేటీఆర్ తెలిపారు. తప్పకుండా కాంగ్రెస్ పార్టీ నేతలను ఉరికించి కొట్టే రోజులు దగ్గర పడ్డాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని రామ్‌లీలా మైదానంలో ఏర్పాటు చేసిన రైతన్నల ధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్ నుంచి ఉదయం ఏడున్నరకు వెళ్లినం.. కానీ కాంగ్రెస్ పాలన ఎట్ల ఉందంటే.. అన్ని పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. మేడ్చల్ వద్దనే 45 నిమిషాలు పట్టింది. ఇక డిచ్‌పల్లి వద్ద కొందరు మహిళలు రోడ్డుకు అడ్డంగా కూర్చుని ధర్నా చేస్తున్నారు. ఏం కష్టమొచ్చింది అని దిగాను. వాళ్లు పోలీసోళ్ల భార్యలు. వన్ పోలీసింగ్ కావాలని డిచ్‌పల్లి బెటాలియన్ వద్ద ధర్నా చేస్తున్నారు. ధర్నా చేస్తున్న మమ్మల్ని రక్తం కారేలా గుంజుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఆ ఆడబిడ్డలు. అఖరికి కాంగ్రెస్ పాలనలో పోలీసోళ్ల భార్యలు ధర్నాలు చేసే పరిస్థితి.. వారు కూడా పోలీసోళ్ల చేతిలో దెబ్బలు తినే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ మండిపడ్డారు. పోలీసులను కోరుతున్నా.. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. ఇలాంటి కిరాతక పనులు బీఆర్ఎస్ పాలనలో చేయలేదు. మంత్రినో, కంత్రినో ఫోన్ చేస్తే ఆగం కాకండి.. న్యాయం, ధర్మం ప్రకారం నడుచుకోండి. పోలీసులైనా, అధికారులైనా ఎక్స్‌ట్రాలు చేస్తే పేర్లు రాసిపెట్టి మిత్తితో సహా ఇస్తాం. రేవంత్ రెడ్డి రాజు, చక్రవర్తి కాదు. చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి లాంటి నాయకులతోనే కొట్లాడినం.. వీడెంత చిట్టినాయుడు.. గింతంత మనిషి.. వాని చూసి ఆగం కావొద్దు. ఉద్యోగులు పద్ధతి ప్రకారం ఉద్యోగం చేయండి. అతికి పోతే మా టైమ్ వచ్చాక మిత్తితో సహా ఇస్తామని కేటీఆర్ హెచ్చరించారు. దే ఆదిలాబాద్‌లో ఖానాపూర్ చెరువు వద్ద 2 వేల ఇండ్లు కూలగొట్టేందుకు అధికారులు వెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఆ ఇండ్లకు పర్మిషన్లు, పట్టాలు ఇచ్చారు. బాధితుడు బొడిగెం గంగన్న

నాలుగు తిట్లు తిట్టిండు. ఇల్లు కూలగొడితే ఎవడన్న ఊకుంటాడా..? ఆయన తిట్టిండని ఆయన మీద కేసు పెట్టారు.. జైల్లో పెడుతారట.. వంద రోజుల్లో అన్ని చేస్తానని తప్పించుకున్న లుచ్చాగాళ్ల మీద కేసులు పెట్టాల్నా.? పేదల మీద కేసులు పెట్టాల్నా..? అల్లం బెల్లం ఇస్తామని అడ్డగోలు మాటలు చెప్పి రైతులను మోసం చేస్తున్న లుచ్చాగాళ్లపై చీటింగ్ కేసులు పెట్టాలి. రైతుల మీద కేసులు పెడుతాం అంటే ఊరుకునేందుకు సిద్ధంగా లేమని కేటీఆర్ తేల్చిచెప్పారు.

## ఒక్కరోజే 70కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు..!

దేశీయ సంస్థల విమానాలకు వరుసగా బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది. ఒకవైపు కేంద్రం హెచ్చరికలు చేస్తున్నప్పటికీ.. తాజాగా పదుల సంఖ్యలో విమానాలకు ఈ నకిలీ బెదిరింపులు రావడం ఆందోళన రేకెత్తిస్తోంది. గురువారం ఒక్కరోజే 70కిపైగా విమానాలకు ఈ పరిస్థితి ఎదురైనట్లు సమాచారం. వాటిలో ఎయిరిండియా, విస్తారా, ఇండిగో, ఆకాశ ఎయిర్ విమానాలున్నాయి. మొత్తంగా 11 రోజుల వ్యవధిలో 250 ఫ్లైట్లకు ఈ బెదిరింపులు వచ్చాయి.

ఆకాశ ఎయిర్ ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ.. అక్టోబర్ 24న తమ సంస్థకు చెందిన కొన్ని విమానాలకు భద్రతాపరమైన అలర్ట్స్ వచ్చినట్లు తెలిపారు. “మా అత్యవసర ప్రతిస్పందన బృందాలు వాటిని పరిశీలిస్తున్నాయి. భద్రత, నియంత్రణ సంస్థల అధికారులతో టచ్‌లో ఉన్నాం. భద్రతాపరమైన నియమావళిని పాటిస్తున్నాం” అని తెలిపారు. ఇండిగో సంస్థ సైతం ఇదే స్పందనను తెలిపింది.వరుసగా జరుగుతున్న ఘటనల నేపథ్యంలో ఇటీవల పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. విమానయాన భద్రతే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమన్నారు. బెదిరింపులకు పాల్పడేవారిని నోఫ్లై జాబితాలో చేర్చేలా చట్టాలను సవరిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు వచ్చిన బెదిరింపులు మొత్తం ఉత్తుత్తి బెదిరింపులేనని తేలిందన్నారు. బెదిరింపు కాల్స్, సోషల్ మీడియా పోస్టులకు పాల్పడేవారికి జీవిత ఖైదు విధించేలా చట్టపరమైన మార్పులు తెచ్చేందుకు యత్నిస్తున్నామన్నారు. విమానంలో బోర్డింగ్ అయ్యాక బెదిరింపులకు పాల్పడేవారికి ఇటువంటి శిక్ష విధించేలా ఇప్పటికే చట్టంలో సెక్షన్లు ఉన్నాయి. కానీ, ఇతర ప్రాంతాల్లో ఉంటూ బెదిరింపులకు పాల్పడేవారికి కూడా వీటిని వర్తింపజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

“గత వారం పలు విమానాలకు బెదిరింపులు రావడంతో వేరే మార్గాలకు మళ్లించాము. ప్రతి దానిని ప్రత్యేకంగా విశ్లేషించి వేగంగా, సమర్థవంతంగా చర్యలు తీసుకొన్నాం. అవి తప్పుడు బెదిరింపులైనా.. భద్రత, సురక్షిత విషయంలో రాజీ పడటంలేదు. ప్రయాణికుల ప్రాణాలే మాకు ముఖ్యం. అదే సమయంలో ఒక్క విమానాన్నైనా దారి మళ్లించాలనో, జాప్యం చేయాలనో మేము అనుకోవడం లేదు. హోంశాఖ, ఇతర ఏజెన్సీలతో కలిసి వీటిపై దర్యాప్తును వేగవంతం చేస్తున్నాం. రానున్న రోజుల్లో మెరుగైన పరిస్థితిని చూస్తాం” అని కేంద్ర మంత్రి చెప్పారు. ఈ నేపథ్యంలోనే ‘ఎక్స్’(ట్విటర్), మెటాతో సహా పలు సామాజిక మాధ్యమాల ప్రతినిధులతో వర్చువల్‌గా కేంద్ర ప్రభుత్వ అధికారుల భేటీ అయ్యారు.

# రాహుల్ ఆలోచనలకు భిన్నంగా రాష్ట్ర కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి

తాజాగా పార్టీలో కొనసాగుతున్న పరిణామాలను జీర్ణించుకోలేక తీవ్ర మానసిక వ్యధతో ఏఐసీసీ చీఫ్‌కు జీవన్ రెడ్డి లేఖ రాశారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ గురించి లేఖలో సంచలన వ్యాఖ్యలు చేశారు. నేను నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ నన్ను అగౌరవంగా, అవమానంగా చూస్తోంది. నా భవిష్యత్తు కార్యాచరణ పార్టీనే మార్గదర్శకం చేయాలి. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి , పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లకు ఎమ్మెల్సీ లేఖ రాశారు. కాంగ్రెస్‌లో తనకు జరుగుతున్న అన్యాయం, పరిణామాలను వివరిస్తూ ఎమ్మెల్సీ లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే సంజయ్ అనుచరుడిగా భావించే సంతోష్ కాంగ్రెస్ పార్టీ నాయకుడిని హత్య చేశాడని వెల్లడించారు. పదేండ్లు అనేక దౌర్జన్యాలను ఎదుర్కొన్నామని.. కాంగ్రెస్ ముసుగు కప్పుకొని మళ్ళీ దౌర్జన్యాలు చేస్తామంటే ఎలా భరించాలని అడిగారు. పార్టీని కన్నతల్లి అనుకున్నానని.. పార్టీ తనకు అనేక అవకాశాలు ఇచ్చిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్‌పై పోటీ చేయమంటే చేశానన్నారు. నన్ను ప్రతిపక్షాలు ఏకాకిని చేసి హేళన చేసినా తట్టుకొని నిలబడ్డాను. పార్టీ అధిష్ఠానం నా గౌరవాన్ని కాపాడతానని నోటిమాటగా చెప్పింది. పార్టీ ఫిరాయింపులకు ముఠా నాయకుడు ఉన్నాడు. పార్టీ ఫిరాయింపులకు ముఠా నాయకుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి. పది మంది ఎమ్మెల్యేలు లేకపోతే ప్రభుత్వం కొనసాగాదా.. రాహుల్ ఏం చెప్తున్నాడు. మనం ఏం చేస్తున్నాం. మా పార్టీ నాయకుడు గంగారెడ్డిని చంపిన వ్యక్తి బీఆర్ఎస్ తరపున ఎన్నికల్లో డబ్బులు పంచారు. గంగారెడ్డిని చంపిన సంతోష్‌పై అనేక క్రిమినల్ కేసులు ఉన్నాయి. గంగారెడ్డిని మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నేను ప్రపోజ్ చేశారు. ఎవరి అండదండలు చూసుకొని సంతోష్ మా నాయకుడిని చంపాడు అంటూ ఆయన ప్రశ్నలు కురిపించారు. అలాగే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై కూడా జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘కాంగ్రెస్ పార్టీ పుట్టిందే మా ఇంట్లో’ అంటున్నాడు. మీ ఇంట్లో కాంగ్రెస్ పార్టీ పుడితే పరాయి ఇంటికి ఎందుకు వెళ్ళాడు. సంజయ్ ఎప్పుడైనా కాంగ్రెస్ పార్టీకి ఓటేశాడా.. నేను రాజీవ్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరాను. సంజయ్ చొక్కారావు మనవడిని అని చెప్పుకుంటున్నారు. ఇందిరా గాంధీ కష్టకాలంలో ఉన్నప్పుడు చొక్కారావు జనతా పార్టీలో చేరాడు. సంజయ్ టీఆర్ఎస్‌లో ఎన్నడూ లేడు. అక్కడి ఉద్యమ నాయకుల మధ్య సమన్వయ లోపం వల్ల సంజయ్ తెరపైకి వచ్చాడు. అభివృద్ధి జరగాలంటే అధికార పార్టీలో చేరతామంటే ప్రజాస్వామ్యం ఉంటుందా. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కేసీఆర్ పరిస్థితి ఏమయిందని అంటూ వ్యాఖ్యలు చేశారు. అలాగే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పైనా ఎమ్మెల్సీ విరుచుకుపడ్డారు. భట్టికి ప్రతిపక్ష నేత హోదా పోవడానికి కారణం పోచారమన్నారు. పోచారం లాంటి వాడిని పార్టీలో చేర్చుకోవడం ఏంటి? పోచారం సలహాదారుడు ఏంటి. పార్టీ ఫిరాయింపుల క్రమబద్ధీకరణ విషయంలో పోచారం సలహాలు ఇవ్వగలడు అంటూ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు.నేను నిద్రలేని రాత్రులు గడుపుతున్నాను. పార్టీని వదిలి వెళ్ళాలనే ఆలోచన చేయలేకపోతున్న. అవమానాలు భరించుకుంటూ ఉండాలా? రేవంత్ మా నాయకుడు. ఆయన్ని తప్పకుండా కలుస్తాను. కాంగ్రెస్ కార్యకర్తల ఆవేదన మా వ్యక్తిగతం అని పీసీసీ చీఫ్ భావిస్తే నేనేం చేయగలను. పార్టీ పట్ల గౌరవం లేకనే నేను ఇక్కడి దాకా వచ్చానా.. ఇప్పటికీ నాకు పార్టీపై గౌరవం ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. రేవంత్ నాయకత్వంలో ప్రభుత్వం సమర్థవంతంగా పని చేస్తోంది. నేను రాజకీయం చేయడం లేదు. సంజయ్ భుజాలు తడుముకుంటున్నాడు. మా పార్టీ నాయకుడిని చంపిన నిందితుడు సంజయ్ అనుచరుడు కాదని చెప్పగలరా.. సంజయ్ ఏ పార్టీలో ఉన్నాడో ఆయనకి క్లారిటీ లేదా.. దానం నాగేందర్‌కు ఎంపీ టికెట్ ఇవ్వడాన్ని సమర్థించడం లేదు. నేను ఎప్పుడూ పార్టీ ఫిరాయించలేదు. నాకు నేనుగా మంత్రి పదవికి రాజీనామా చేశారు. పదేండ్లలో నేను పార్టీని నిలబెట్టాను. రాహుల్ ప్రధాని కావాల్సిందే. నామినేటెడ్ పదవులు మాకు ఇవ్వాలి. పార్టీలో మాదే ఆధిపత్యం ఉండాలి అంటే ఎలా. పార్టీ ఫిరాయించి ముసుగేసుకొని దౌర్జన్యం చేయడం బ్లాక్ మెయిల్ కాదా. నా మానసిక పరిస్థితి అర్థం చేసుకోండి. పార్టీ ఫిరాయింపులు జరిగాయో లేదో క్లారిటీ లేకుండా పోతుంది. నేను పార్టీకి అంతర్గతంగా లేఖ రాశాను. ఆవేదన భరించలేక బయటకి చెప్పుకుంటున్నానని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

# విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదన సరికాదు

మొదటిపేజీ తరువాయి




ఈ వసందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ..ఇళ్లకు వాడుకునే కరెంటు నెలకు 300 యూనిట్లు దాటితే కిలోవాట్‌కు ఫిక్స్‌డు ఛార్జీని ప్రస్తుతం రూ.10 వసూలు చేస్తుండగా దాన్ని రూ.50 కి పెంచాలని డిస్కంలు కోరటం సరికాదన్నారు. ఇటీవల కాలంలో విద్యుత్ వినియోగం అనేది చాలా పెరిగిపోయింది.

ఎండాకాలం వచ్చిదంటే చాలు 300యూనిట్ల విద్యుత్ వినియోగం సాధారణమైందని పేర్కొన్నారు. ఇది ప్రజలపై పెను భారం మోపుతుంది. వారిని ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. 300 యూనిట్లు పై వాడే మధ్య తరగతి ప్రజలకు దీనివల్ల ప్రతి నెల వేల రూపాయల భారం పడుతుంది. ఇంత పెద్ద ఎత్తున విద్యుత్ ఛార్జీలు పెంచాలని ప్రతిపాదించటం సమంజసం కాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సవాళ్లు ఎదుర్కొని ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించిందని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ కేవలం ఒక వ్యాపార వస్తువుగా చూడటం దురదృష్టకరమన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలన్నారు.చిన్న పరిశ్రమలకు, భారీ పరిశ్రమలకు ఇచ్చే కరెంట్ కు ఒకే విధమైన రేటు కట్టటమంటే ఒక విధంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు ఉరి వేస్తున్నట్లేనని అన్నారు. నిర్ణయం కారణంగా రాష్ట్రంలో ఉన్న ఎస్ఎంఎస్ఈ మొత్తం రోడ్డున పడే పరిస్థితి వస్తుంది. దాంతో లక్షల మంది ఉపాధి కోల్పోతారు.పరిశ్రమలన్నింటినీ ఒకే గాటున కట్టాలని భావించటం దుర్మా ర్గం. దీని కారణంగా సిరిసిల్ల, కాటేదాన్ సహా చాలా ప్రాంతాల్లో ప్రభుత్వం ఇచ్చే విద్యుత్ సబ్సిడీలు బంద్ అయ్యే పరిస్థితి ఉంటుంది దీంతో వేలాది మంది ఉపాధి పై ప్రభావం చూపుతుందని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో పారిశ్రామిక రంగంలో మందగమనం మొదలైంది. చాలా కంపెనీలు రాష్ట్రాన్ని వీడి వెళ్తున్నాయి. ఫాక్స్ కాన్ లాంటి సంస్థ తన కంపెనీ విస్తరణను విరమించుకుంది. లాంటి పరిస్థితుల్లో పరిశ్రమలను కాపాడుకోవటానికి వీలైనంత వరకు వారికి ప్రోత్సహాకాలు ఇవ్వాలి. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న పరిశ్రమలు కూడా ఆగమయ్యే విధంగా విద్యుత్ ఛార్జీలను పెంచాలని ప్రయత్నిస్తోంది. ఉచిత విద్యుత్ భారాన్ని మధ్యతరగతి, చిన్న పరిశ్రమలు, భారీ పరిశ్రమలపై వేయాలని ఆలోచిస్తోంది. వారి ఆనాలోచిత నిర్ణయాల కారణంగా మొత్తం రాష్ట్ర అభివృద్ధి కుంటు పడే ప్రమాదం ఉంది. డిస్కంలు ప్రతిపాదించిన 9 ప్రతిపాదనలను తిరస్కరించాలి. డిస్కంలు చేస్తున్న ప్రతిపాదనల వెనుక ఖచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వమే డిస్కంల పేరుతో ప్రజల నడ్డి విరిచేందుకు దొడ్డి దారిలో ప్రయత్నాలు చేస్తోందన్నారు. నిజానికి ఈ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అంటూ అధికారంలోకి వచ్చింది. ఎప్పుడు దాన్ని ఎలా అమలు చేయాలో తెలియక అసంబద్ధ నిర్ణయాలు తీసుకొంటోంది. ట్రూ అప్ ఛార్జీలు, తక్షణం విద్యుత్ ఛార్జీల పెంపు అంటూ కాంగ్రెస్ పార్టీ ప్రజలపై భారాన్ని మోపేందుకు తొందరపడుతోంది. కనుక ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ ఛార్జీల పెంపు అనేది రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తుంది. ఇప్పటికే ఈ ప్రభుత్వం విద్యుత్ సరఫరా లో వైఫల్యం చెందటంతో ప్రజలు, రైతాంగం విసిగిపోయి ఉన్నారు. ఇఃుద్యుత్ ఛార్జీల పెంపు ద్వారా జరిగే అనర్థాలను పరిగణలోకి తీసుకోకుండా ఈ ప్రభుత్వం మూర్ఖంగా వ్యవహరిస్తోంది.విద్యుత్ ను ప్రజల జీవనాడిగా ఉన్న ఒక ప్రాథమిక హక్కు గా భావించినప్పుడే ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతాయి. రాష్ట్రం ఏర్పడితే తెలంగాణ అంధకారం అవుతుందన్న విమర్శలకు దేశంలో ఎక్కడ లేని విధంగా 24 గంటల కరెంట్ ఇచ్చి అవన్నీ తప్పుడు ఆరోపణలని నిరూపించారు. ఃుష్ట్ర రైతాంగానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తు నుంచి మొదలుకొని పారిశ్రామిక రంగానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేశాం. క్రమంలో కేసీఆర్ గారు విద్యుత్ రంగంలో ఎన్నో అవరోధాలను ఎదుర్కొని విజయాలు సాధించారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు 7 వేల మెగావాట్లు మాత్రమే ఉన్న విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 24 వేల మెగావాట్లకు తీసుకెళ్లారు. ఃుణ్యమైన విద్యుత్ అందించేందుకు ట్రాన్ ఫార్మర్లు, విద్యుత్ లైన్లను ఆధునీకరించారు. మొత్తం విద్యుత్ రంగంలోనే సమూలమైన మార్పులు తెచ్చారు. క్రమంలో ఎంత ఖర్చైనా వెనుకడలేదు. పైగా ప్రజలపై భారం అసలే మోపలేదు. కేసీఆర్ ప్రభుత్వంలో కూడా డిస్కంలు విద్యుత్ ఛార్జీల పెంపును ప్రతిపాదిం చాయి కానీ ఆయన అందుకు ససేమిరా అన్నారు.ట్రూ అప్ ఛార్జీల పెంపునకు కూడా అనుమతి ఇవ్వకుండా దాదాపు 1200 కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరించింది.విద్యుత్ అనేది రాష్ట్ర ప్రగతికి ఇంజన్ లాంటిదని ఆయన భావించారు కనుకే విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపలేదు. దాని ఫలితాలు ఇవ్వాళ తెలంగాణలో కనిపిస్తున్నాయి రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా కారణంగా రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి నాలుగు రెట్లు పెరిగింది. ఃూరీ పరిశ్రమలు, (ఎస్ఎంఎస్ఈ) లకు 24 గంటలు కరెంట్ సరఫరా చేయటంతో పరిశ్రమ వర్గాలు సంతోషంగా ఉన్నాయి. ఎస్ఎంఎస్ఈ రంగం లో తెలంగాణ సాధించిన అభివృద్ధి ని ఇటీవలే కాంగ్రెస్ ప్రభుత్వమే నివేదిక విడుదల చేసింది. తెలంగాణ అభివృద్ధికి విద్యుత్ రంగంలో తీసుకొచ్చిన సమూల మార్పులు, ప్రజలపై ఎలాంటి భారం పడకుండా చేపట్టిన చర్యలే కారణం. ప్రభుత్వం విద్యుత్ ను కేవలం ఒక వ్యాపార వస్తువు గా చూడటం దురదృష్టకరం. లాంటి విద్యుత్ విషయంలో ఈ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. పరిశ్రమలు (ఎస్ఎంఎస్ఈ), గృహాలకు విద్యుత్ ఛార్జీలు అడ్డగోలుగా పెంచితే మొత్తం ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుంది.గతంలో ఎన్ని కష్టాలు వచ్చినా ఐఅఖీ గారు, అప్పటి డిస్కం లు ప్రజల పైన విద్యుత్ చార్జీల భారాన్ని వేయలేదు.

ప్రభుత్వం బాధ్యత మరిచి అడ్డగోలుగా డిస్కంల ద్వారా చేయిస్తున్న ఈ ప్రతిపాదనలను ఈఆర్సీ తిరస్కరించాలని బాధ్యత కలిగిన ఈఆర్సీ ఈ విషయంలో ప్రజలు, రాష్ట్రం క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకోవాలనీ బీఆర్ఎస్ తరఫున విజ్ఞప్తి చేస్తున్నామని వేముల తదితరులు విన్నవించారు.

# కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో నిర్మాణాలు

మొదటిపేజీ తరువాయి

ఇక ఈ వ్యవహారంపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారా.. అని ఆరా తీసింది. వివరాలతో నివేదిక సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. భీమిలి బీచ్ వద్ద సీఆర్‌జడ్ ప్రాంతంలో సముద్రానికి అతి సమీపంలో శాశ్వత కాంక్రీట్ నిర్మాణం చేపడుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ప్రజాప్రయోజన వాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై గురువారం విచారణ జరిపిన ధర్మాసనం సముద్రానికి అతి సమీపంలో చేపట్టిన శాశ్వత నిర్మాణాలను తొలగించాలని జీవీఎంసీని ఆదేశించింది. ఈ వ్యాజ్యం నిన్న మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపించారు. కాగా వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కూతురు నేహారెడ్డి భీమిలి బీచ్ వద్ద సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టారు. నేహా రెడ్డి సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ హైకోర్టులో పిల్ కూడా దాఖలు చేశారు. బీచ్‌లో కాంక్రీట్ నిర్మాణాలను అనుమతించవద్దని అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. నేహా రెడ్డికి సెప్టెంబర్ 2న జీవీఎంసీ నోటీసులు జారీ చేసింది. 24 గంటల్లో ఆక్రమణలు తొలగించాలని.. లేదంటే తామే తొలగిస్తామని హెచ్చరించింది. ఈ క్రమంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేసేందుకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. విశాఖ జిల్లా భీమిలి బీచ్ వద్ద సముద్రానికి అతి సమీపంలో సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘించి నేహారెడ్డి కాంక్రీట్ గోడను నిర్మించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ అధికారులకు ఇప్పటికే హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. భీమిలి బీచ్ సమీపంలో శాశ్వత నిర్మాణాలపై జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ పిల్ వేశారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. కూల్చివేత విషయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో వివరిస్తూ స్థాయి నివేదికను సమర్పించాలని గత నెలలో హైకోర్టు నిర్దేశిరచి ఆపై తదుపరి విచారణను సెప్టెంబరు 11వ తేదీకి వాయిదా వేసింది. భీమిలి బీచ్ సమీపంలో శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ తరఫున న్యాయవాది పొన్నాడ శ్రీవ్యాస్ వాదనలు వినిపించారు.

## రాష్ట్ర ప్రభుత్వం సహకరించకున్నా యాదాద్రికి MMTS సర్వీసు పొడిగింపు: కిషన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

మరిన్ని తీసుకొస్తామన్నారు. రూ.720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పనులు చేస్తున్నట్లు వివరించారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనికి రూ.650 కోట్లు అవసరమని చెప్పారు. ఘట్‌కేసర్ వరకు ప్రస్తుతం ఎంఎంటీఎస్ సర్వీసు ఉందని.. అక్కడి నుంచి యాదాద్రి వరకు విస్తరించాల్సి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం సహకరించకున్నా ఎంఎంటీఎస్ సర్వీసును పొడిగిస్తున్నట్లు వ్యాఖ్యానించారు.కార్యక్రమంలో ఎంపీలు సురేష్‌రెడ్డి, కావ్య, డీకే అరుణ, రఘునందన్‌రావు పాల్గొన్నారు. పలు సమస్యలను వారు జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈదుల నాగులపల్లి స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని ఎంపీ రఘునందన్ రావు కోరారు. కొల్లూరు, ఈదుల నాగులపల్లి రైల్వే బ్రిడ్జిని అభివృద్ధి చేయాలన్నారు. జర్నలిస్టులు, దివ్యాంగులకు రైల్వే పాస్‌లను పునరుద్ధరించాలని కోరారు. మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వే లైన్ పూర్తి చేయాలన్నారు.

## జీవన్ రెడ్డి వ్యాఖ్యలను స్వాగతించిన వేముల

మొదటిపేజీ తరువాయి

### ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటేయాలని డిమాండ్

నిజామాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసి ఎన్నికలకు వెళ్లాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే వేముల స్పందించారు. మీ పార్టీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసన సభాపతి ప్రసాద్, ఎమ్మెల్సీ గుత్తా సుఖేందర్ రెడ్డి త్వరగా నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రజాక్షేత్రంలోకి వెళ్దాం. ప్రజలే న్యాయ నిర్ణేతలు. మీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారు. ప్రజలు మీకు బుద్ది చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. సొంత పార్టీ నేతలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో తగు నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు.

## భవిష్యత్‌లో తెలంగాణలో సొంతంగా సీడ్ గార్డెన్ ఏర్పాటు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: భవిష్యత్తులో తెలంగాణలోనే సొంతంగా సీడ్ గార్డెన్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మలేసియా పర్యటనలో ఉన్న మంత్రి.. రెండో రోజు పలు సంస్థలను సందర్శించారు. ప్రపంచంలో అతి పెద్ద వ్యాపార ఆధారిత క్రూడ్ ఫామాయిల్ ఉత్పత్తిదారుల్లో ఒకటైన ఎఫ్‌జీవీ కంపెనీ సీడ్ గార్డెన్‌ను సందర్శించారు. నర్సరీలను, అధునాతన సాంకేతిక పద్ధతులతో ఉన్న విత్తన కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆ కంపెనీ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సొంతంగా సీడ్ గార్డెన్ ఏర్పాటుకు ఎఫ్‌జీవీ కంపెనీ సహకరించాలని కోరారు. అందుకు రాష్ట్ర భాగస్వామ్యంతో పని చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అనంతరం ఎఫ్‌జీవీ కంపెనీ రిఫైనరీ కర్మాగారాన్ని సందర్శించి అక్కడ తయారు చేసే వివిధ ఉత్పత్తులను మంత్రి పరిశీలించారు. కంపెనీ తీసుకునే జాగ్రత్తలు, వివిధ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిమాండ్ గురించి మంత్రి తుమ్మలతోపాటు అధ్యయన బృందానికి ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు.

## అమిత్ షా, ఒమర్ అబ్దుల్లా భేటీ.. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై చర్చలు!

ఇటీవల జరిగిన జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో విజయం సాధించి ఒమర్ అబ్దుల్లా సీఎంగా బాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే. తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ఆయన భేటీ అయినట్లు తెలుస్తోంది. జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా కల్పించాలనే అంశంపై వీరిద్దరూ చర్చించినట్లు సమాచారం. ఈమేరకు జాతీయమీడియా కథనాలు వెల్లడించాయి. ఇటీవల సీఎం ఒమర్ అబ్దుల్లా జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈవిషయమై చర్చించేందుకు బుధవారం సాయంత్రం దిల్లీలో కేంద్రమంత్రి అమిత్ షాతో భేటీ అయినట్లు తెలుస్తోంది. ఈ భేటీలో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వానికి కేంద్రం మద్దతు తెలపడంతో పాటు, రాష్ట్ర హోదా పునరుద్ధరణపై కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు సీఎం ఒమర్ అబ్దుల్లా నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి తీర్మానప్రతిని అందజేయనున్నట్లు తెలుస్తోంది.జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత తొలిసారి ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎన్‌సీ- కాంగ్రెస్ కూటమి విజయం సాధించగా.. ఒమర్ అబ్దుల్లా సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని రాష్ట్ర కేబినెట్ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈ తీర్మానాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా సైతం ఆమోదించారు.

## పత్తి, వరి చేన్లతో బిజీగా మారిన రైతాంగం..

## గ్రామాలలో ఏర్పడిన కూలీల కొరత..

- పక్క ఊర్లో నుండి కూలీలను తరలిస్తున్న ఆసాములు..
- పత్తి ధర పెంచాలంటూ రైతులు ఆవేదన...



**కరపత్రం ప్రతినిధి,వీణవంక, అక్టోబర్ 24.**



వీణవంక మండల పరిధిలోని గ్రామ గ్రామాన ఒకేసారి వరి చేనులు, పత్తి చేనులతో మండల రైతాంగం బిజీ బిజీగా మారింది. వరి పంట ఖరీఫ్ సీజన్ కోతలు ప్రారంభమైనప్పటికీ,రైతులు ఎక్కువగా పచ్చి వడ్ల అమ్మకంలో ఆసక్తి చూపుతూ, వర్షాభావ పరిస్థితుల దృష్టితో ఉంచుకొని వరి ధాన్యాన్ని ఆరబోయకుండా అమ్మకాలు చేస్తున్నారు. మరోవైపు సమయం సందర్భం లేకుండా కురుస్తున్న ఆకస్మిక వర్షాలకు పత్తి రైతులు ఆగమవుతున్నారు.ఒకేసారి పత్తి,వరి చేన్లలో పనులు ప్రారంభంతో మహిళా కూలీల కొరత అధికంగా ఏర్పడింది. పత్తి చేనులో వర్షం కురిసింది అంటే ప్రతి తేమతో నల్లగా మారి, పత్తిలో మొలకలు, నాణ్యత తగ్గి,ధర తగ్గుతుందని భయంతో కూలీలకు అదనంగా రూపాయలు చెల్లించి, పక్క ఊళ్ళ నుండి ట్రాలీలలో, ఆటోలలో కూలీలను తీసుకు రావడం జరుగుతుంది. నర్సింగాపూర్ గ్రామ రైతు పోతరవేన సమ్మయ్య మాట్లాడుతూ... పత్తి చేనులోపండిన పంట అప్పులకు, కూలీలకు, పెట్టుబడులకి సరిపోతుందని, పత్తి రైతులనుఆదుకోవాలని,క్వింటాలుకు కనీసం మద్దతు ధర 10,000 రూపాయలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థ అయిన సీసీఐ ద్వారా కొనుగోలు జరిపి, రైతులను అప్పుల బాధ నుండి కాపాడాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# తెలంగాణ పులి ఎక్కడ?



**- శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ ఎక్కడా కనిపించకుండానే కీలకమైన పరిణామాలు జరిగిపోతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల ప్రచారం తర్వాత ఫామ్ హౌస్ కు వెళ్లిన కేసీఆర్ అప్పటి నుండి చిన్న ప్రకటన కూడా రిలీజ్ చేయలేదు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో తన పేరుపై సోషల్ మీడియా ఖాతాలను ప్రారంభించేశారు. కానీ అందులో పోస్టులు పెట్టడం ఆపేశారు. అసలు రాజకీయంగా పూర్తిగా సైలెంట్ అయిపోయారు. పార్టీ నేతలకూ ఆయన సలహాలు, సూచనలు ఇస్తున్న సూచనలు కూడా కనిపించడం లేదు. పూర్తిగా కేటీఆర్ మాత్రం ఒంటరిగా పార్టీని లాగుతున్నారు. మధ్యలో హరీష్ కూడా తన వంతు సాయం చేస్తున్నారు. అయితే మొత్తం కేటీఆరే కనిపిస్తున్నారు.

### అదిగో పులి వచ్చే అనే ప్రచారమే తప్ప కేసీఆర్ ఎక్కడ

కల్వకుంట్ల కవితకు బెయిల్ వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రజల్లోకి వస్తారన్న ప్రచారం జరిగింది. పూర్తి స్థాయిలో రైతు రుణమాఫీ చేయని కారణంగా రైతుల్లో ఉన్న అసంతృప్తిని ఉద్యమంగా మార్చేందుకు ఆయన సిద్ధమవుతున్నారని బీఆర్ఎస్ వర్గాలు చెప్పాయి. ఒకటి రెండు రోజుల్లో టూర్ షెడ్యూల్ రెడీ అవుతుందని కూడా అన్నారు కానీ రెండు నెలలు గడుస్తున్నా ఆయన బయటకు రాలేదు. వస్తారన్న నమ్మకం కూడా ఇప్పుడు బీఆర్ఎస్ నేతలకు లేదు. దీనికి కారణం కేటీఆర్ కూడా .. కేసీఆర్ వస్తారని ఉద్యమాలు చేద్దామని చెప్పడం లేదు. ఎవరైనా కేసీఆర్ వస్తే బాగుండనే సహాలిస్తున్నా వెంటనే తుంచేస్తున్నారు. కేసీఆర్ లేని లోటును తీర్చేలా తానే ప్రతీ దానికి ముందు ఉండేలా చురుకుగా వ్యవహరిస్తున్నారు.

తెలంగాణ రాజకీయాలు చాలా వేడి మీద ఉన్నాయి. ఒక్కో అంశం హాట్ టాపిక్ అవుతోంది. మొదట రుమమాఫీ అంశంతో బీఆర్ఎస్ ఉద్యమం చేసినంత పని చేసింది. ఈ కారణంగా అందరికీ రుమమాఫీ కాలేదని.. కొంత మందికి పెండింగ్ ఉందని ప్రభుత్వం అంగీకరించాల్సి వచ్చింది. తర్వాత కేటీఆర్ పై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యల దుమారం రేగింది. అది కేసీఆర్ ఫ్యామిలీని ఇబ్బంది పెట్టే విమర్శలే. అయినా స్పందించలేదు. తర్వాత గ్రూప్ వన్ వివాదం తెరపైకి వచ్చింది. అప్పటికి మూసీ వివాదం రేపిన చిచ్చు అలాగే ఉంది. మరి కొంత కాలం ఈ మూసీ వివాదం ఉంటుంది. అయినా కేసీఆర్ వైపు నుంచి కనీస స్పందనలేదు. పూర్తిగా రాజకీయాలపై కేసీఆర్ ఇప్పుడు వ్యతిరేకతతో ఉన్నారని ఆయన స్పందించడానికి కూడా సిద్ధంగా లేరని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి.

### కేటీఆర్ సామర్థ్యానికి పరీక్ష పెడుతున్నారా?

కేటీఆర్ తెలంగాణ ఉద్యమం ఊపందుకున్న తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. అందువల్ల ఆయన రాజకీయాల్లో ఢక్కా మొక్కీలు ఎదుర్కోలేదు. ఇప్పుడు అసలైన ప్రతిపక్ష నేతగా అనేక సవాళ్లను ఆయన ఎదుర్కోవాల్సి ఉంది. ఇప్పుడు ఎన్నో ఎదురు దెబ్బలు తిని రాటుదేలితేనే రాజకీయాల్లో మంచి భవిష్యత్ ఉంటుందన్న ఉద్దేశంతో కేటీఆర్‌కు ఫుల్ చార్జ్ ను కేసీఆర్ అప్పగించారని అంటున్నారు. ఎంతో క్లిష్టమైన సందర్భంలో తప్ప ఇతర విషయాల్లో కనీసం సలహాలు కూడా ఇవ్వడం లేదని మొత్తం కేటీఆర్ సామర్థ్యానికి వదిలేశారని చెబుతున్నారు. కేటీఆర్ కూడా ఇప్పుడు తనను తాను నిరూపించడానికి ఎలాంటి సవాళ్లనైనా స్వీకరించేందుకు సిద్దంగా ఉన్నారని ..అంటున్నారు. కేసీఆర్, కవిత ఇప్పుడల్లా మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్ లోకి వచ్చే చాన్స్ లేదని అంటున్నారు.

## జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలోకి నాగుపాము

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్ 24**



కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలోకి నాగు పాము బుసలు కొట్టుకుంటూ రావడం జరిగినది హమాలీలు రైతులు వ్యవసాయ మార్కెట్ సిబ్బంది భయభ్రాంతులకు గురి కావడంతో మార్కెట్ ఆఫీసులో పనిచేస్తున్న అప్పాల నాగర్జున పామును చాకచక్యంగా పట్టుకొని బయటికి పంపించడం జరిగినది పాములు పట్టుకున్న తీరును చూస్తే ఆశ్చర్యానికి గురి చేయడంతో పాటు అందరూ ఊపిరి పీల్చుకున్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ సిబ్బంది ద్వితీయ శ్రేణి కార్యదర్శి ఎన్ రాజా. రైతులు, కార్మికులు వ్యాపారస్థులు మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన గవర్నమెంట్ ఆసుపత్రి ప్రారంభోత్సవం మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు.

**కరపత్రం దినపత్రిక మెదక్ నర్సాపూర్.**

నర్సాపూర్ నియోజకవర్గంలోని సంగారెడ్డి జిల్లాహత్నూర మండలం దౌల్తాబాద్ కేంద్రంలో ఒక కోటి 56 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన పిహెచ్సి భవనాన్ని రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ కొండ సురేఖలు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మరింతగా వైద్య సేవలు విస్తరించేందుకు ఈ



పిహెచ్సి భవనాలు ఉపయోగపడతాయని మంత్రి అన్నారు రానున్న రోజుల్లో నర్సాపూర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం పనిచేస్తామని అన్నారు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉంటేనే అభివృద్ధి సాధ్యపడుతుందని దానిలో భాగంగా హెల్త్ ప్రొఫైల్ ను తయారు చేస్తున్నట్లు ప్రకటించారు జిల్లాలో మెడికల్ కాలేజీలతో పాటు మారుమూల ప్రాంతాల్లో సైతం అత్యాధునిక వైద్య సేవలను అందించినట్లు అందుకోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ముందుకు సాగుతుందని అన్నారు కార్యక్రమంలో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి తోపాటు పెద్ద ఎత్తున అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## మాలల మహాపాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



**కరపత్రం అక్టోబర్ 24/హుజురాబాద్: ప్రతినిధి**

హుజురాబాద్ స్థానిక అంబేద్కర్ కూడలి వద్దమాలల మహా పాదయాత్ర కరపత్రాన్ని మాల మహానాడు నాయకులు ఆవిష్కరణ చేశారు. ఇందులో పాల్గొన్న రాష్ట్ర నాయకులు మేడి అంజయ్య, వెన్న రాజులు మాట్లాడుతూ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ధర్మాసనం 6-1 మెజారిటీతో ఎస్సీ ,ఎస్టీ వర్గీకరణ రాష్ట్రాల పరిధిలో చేసుకోవచ్చని ఇచ్చిన గైడ్ లైన్స్ అంబేద్కర్ ఆశయాలపై ఒక గొడ్డలిపెట్టుగా మారిందని అన్నారు .దళితులను రాజ్యాధికారానికి దూరం చేయాలన్న కుట్రతో ఓటు బ్యాంకు రాజకీయాలకు తెరలేపి రాజకీయ పార్టీలను ,ప్రభుత్వాలను ఒక వర్గం వారు పనిగట్టుకుని దళిత సమాజాన్ని తప్పుతో పట్టిస్తూ పబ్బంగ డుపుకుంటు రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నారని అన్నారు.వర్గీకరణ వల్ల మాలలకు జరుగుతున్న అన్యాయాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ "మాలల మహాపాదయాత్ర "కొనసాగుతుంది .ఈపాదయాత్ర25అక్టోబర్ 2024రోజున భద్రాచలం లో ప్రారంభమై హైదరాబాదులో నవంబర్ 1న బారీ భహిరంగ సభ తో ముగుస్తుంది. ఈ పాదయాత్ర ఒక 1000 కిలోమీటర్లు,16 జిల్లాల మీదుగా,36 నియోజకవర్గ కేంద్రాల మీదుగా మహాపాదయాత్ర డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహాత్మ జ్యోతిరావు పూలే మొదలగు నాయకుల స్ఫూర్తితో కొనసాగుతుంది. ఈ మహా పాదయాత్ర హుజురాబాద్ కు తేదీ 09.11.2024 వ రోజున చేరుకుంటుందని,ఈ మహా పాదయాత్రలో మాల,మాల ఉప కులాలకు చెందిన వివిధ ప్రజా సంఘాలు రాజకీయ పార్టీల నాయకులు ప్రజలు, విద్యార్థులు ,మహిళలు ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు సీనియర్ నాయకులు సొల్లు బాబు, తోగరు స్వామి ,పసుల స్వామి కోడం నర్సింగం, కర్రె తిరుపతి, జూపాక నరసింహం, బందెల హరీష్, సొల్లు దశరథం, జూపాక శ్రీనివాస్, పిట్ట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల నివేశన స్థలాల సమస్యను పరిష్కరించాలి..

- టి పి సి సి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు విజ్ఞప్తి చేసిన ప్రెస్ క్లబ్ సభ్యులు...



**కరపత్రం అక్టోబర్24/ హుజురాబాద్: ప్రతినిధి**

హుజురాబాద్ జర్నలిస్టులకు గత ప్రభుత్వం అందించిన నివేషణ స్థలాల సమస్యను పరిష్కరించాలని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కు హుజురాబాద్ ప్రెస్ క్లబ్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాదులోని గాంధీభవన్ లో ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకొని సత్కరించారు. అనంతరం హుజురాబాద్ జర్నలిస్టులకు ఇచ్చిన నివేషణ స్థలాలకు సంబంధించి ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ కో- కన్వీనర్లు కాయిత రాములు ,నిమ్మటూరు సాయికృష్ణలు మాట్లాడుతూ.... గత 20 ఏళ్లుగా హుజురాబాద్ లో పాత్రికేయులుగా కొనసాగుతున్న తమకు గత ప్రభుత్వం కేసీ క్యాంపులో నివేశన స్థలాల ను అందజేసిందని, దీనికి సంబంధించి నెలకొన్న కోర్టు సమస్యను ఈఎన్ సి సర్టిఫికెట్ అందించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి పరిష్కరించాలని టిపిసిసి అధ్యక్షున్ని కోరినట్టు తెలిపారు. జర్నలిస్టుల నివేశన స్థలాల సమస్యను తక్షణమే పరిష్కరించాలని వారికి విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించి జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. మహేష్ కుమార్ గౌను కలిసిన వారిలో ప్రెస్ క్లబ్ అడక్ కమిటీ సభ్యులు పోతరాజు సంపత్, సభ్యులు తాటిపాముల దేవేందర్ లు ఉన్నారు.

## ఐక్య పోరాటాల తోనే కార్మిక సమస్యలు పరిష్కారం..

- సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి..

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, అక్టోబర్ 24.**

వీణవంక మండల కేంద్రంలో బీరప్ప దేవాలయం ఆవరణలో పిల్లి రవియాదవ్ అధ్యక్షతన ప్రజా సంఘాల సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి, వాసుదేవ రెడ్డి,సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ లు హాజరయ్యారు.ఈ సమావేశంలో మిల్కూరి వాసు దేవ రెడ్డి మాట్లాడుతూ.... కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రజలపై పెనుబారాలు మోపుతూ,రాష్ట్రాల హక్కులనుకాలరాస్తూ,కార్పొరేట్ పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడుతుందని,ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటు వ్యక్తులకు దారదత్తం చేస్తూ,ఒకపక్క కార్మిక చట్టాలను కాలరాస్తూ, మరోపక్కరైతాంగానికివ్యతిరేకమైన నల్లచట్టాలను



చేస్తూ,కొద్దిమంది పెట్టుబడుదారుల ప్రయోజనాల కోసం కోట్లాదిమంది ప్రజల పైన భారాలు మోపుతుందని,ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు,కుటుంబానికి 15 లక్షల నలదనం,మేకిన్ ఇండియా, స్టార్ట్ ఆఫ్ ఇండియా, డిజిటల్ ఇండియా అంటూ కొత్తగా పరిశ్రమలు రాక యువతకు ఉపాధి కరువైందని,మరో ప్రక్కరైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని,2014 ఎన్నికల ముందు బిజెపి పార్టీ ఇచ్చిన హామీలన్నింటిని తుంగలో తొక్కి,ఓట్లు సీట్లు లక్ష్యంగా అధికార పీఠాన్ని భద్రపరచుకునేందుకు,ప్రజల మధ్య వైశామ్యలు సృష్టిస్తూ,ఆర్థిక అంతరాలను పెంచుతుందని ప్రజా సమస్యల పరిష్కారం కోసం రానున్న రోజులలో పెద్ద ఎత్తున ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మర్రి రవీందర్, పోతరవేన రవి,జునూతుల జనార్దన్ రెడ్డి, విజిగిరి సుధాకర్, కాల్వ సమ్మయ్య, కండే ఆశీర్వాదం, వరికోలు కృష్ణ,కండే సదయ్య,దాసారపు మల్లయ్య, వెంకటేష్ శంకర్, కుమార్,కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
శుక్రవారం అక్టోబర్ 25 2024



## తనతో నన్నెలా పోలుస్తారు..

బాలీవుడ్ నటి కృతిసనన్ నటించిన సరికొత్త చిత్రం 'దో పత్తి'. మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. శశాంక చతుర్వేది దర్శకత్వం వహించారు. నెట్‌ఫ్లిక్స్ ఫిల్మ్‌గా అక్టోబర్ 25న ఇది విడుదల కానుంది. ఈనేపథ్యంలోనే కృతిసనన్ ప్రమోషన్స్‌లో బిజీగా పాల్గొంటున్నారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన సోదరి నుపూర్ గురించి మాట్లాడారు. బంధువులు తమని ఒకేలా చూడరని అన్నారు. అందుకు తాను ఎన్నోసార్లు బాధపడ్డానని చెప్పారు. వారి ప్రవర్తన వల్ల చాలాసార్లు కోపం కూడా వచ్చిందన్నారు."నుపూర్, నేను ఎంతో సరదాగా ఉంటాం. అన్ని విషయాలు షేర్ చేసుకుంటాం. తను కూడా ఇటీవల నటిగా తెరంగేట్రం చేసింది. విభిన్నమైన చిత్రాల్లో యాక్ట్ చేస్తూ నటిగా గుర్తింపు తెచ్చుకోవాలని ప్రయత్నిస్తుంది. మేమిద్దరం ఒకే రంగంలో ఉండటం వల్ల బంధువులు మాత్రం మమ్మల్ని పోల్చి చూస్తుంటారు. నాతో ఒకరకంగా తనతో మరోలా ప్రవర్తిస్తుంటారు. వారి ప్రవర్తన చూసి నేను చాలాసార్లు కోపం తెచ్చుకున్నా. మా ఇద్దరినీ పోల్చి చూడాల్సిన అవసరం ఏముంది? తను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి ఎన్నో రోజులు కాలేదు. నేను పరిశ్రమలోకి వచ్చినప్పుడు తను చాలా చిన్నది. నేను ఇక్కడి వచ్చి దాదాపు పదేళ్లు అవుతోంది. అలాంటప్పుడు మమ్మల్ని ఎలా పోలుస్తారు?" అని కృతిసనన్ ప్రశ్నించారు. నుపూర్ చాలా స్ట్రాంగ్ పర్సన్ అని అన్నారు. ఇలాంటివాటిని ఆమె పెద్దగా పట్టించుకోదని చెప్పారు.కృతిసనన్ సోదరిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు నుపూర్ సనన్. తెలుగులో తెరకెక్కిన 'టైగర్ నాగేశ్వరరావు'తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. ప్రస్తుతం ఆమె 'నోరానీ చెహరా' కోసం వర్క్ చేస్తున్నారు. మరోవైపు, 'దో పత్తి'తో కృతిసనన్ నిర్మాతగా మారారు.

## 'టాక్సిక్' టైటిల్ నా సలహానే.. ఎందుకు పెట్టామంటే



యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్ దాస్ 'టాక్సిక్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది దీని ట్యాగ్ లైన్. ఇటీవలే దీని షూటింగ్ ప్రారంభమైంది. తాజాగా ఓ మీడియా ఇంటర్వ్యూలో యశ్ మాట్లాడుతూ.. ఈ సినిమాకు 'టాక్సిక్' అనే టైటిల్‌ను తనే సూచించినట్లు చెప్పారు. ఆ టైటిల్ పెట్టడానికి గల కారణాన్ని వివరించారు."పరిశ్రమలో ఇప్పటివరకు పిల్లల కోసం చాలా కథలు తెరకెక్కాయి. కానీ మేము ఈ సినిమాతో పెద్దలకు సందేశం ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. అందుకే 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనే ట్యాగ్‌లైన్ పెట్టాం. ప్రస్తుతం మనలో చాలామంది గందరగోళ పరిస్థితుల్లో ఉన్నాం. 'టాక్సిక్' అనే పదాన్ని ఎన్నో సందర్భాల్లో ఉపయోగిస్తాం. మనమందరం కూడా విషపూరిత పరిస్థితుల్లో జీవిస్తున్నాం అందుకే ఈ టైటిల్, ట్యాగ్‌లైన్ చాలా సందర్భోచితంగా అనిపించాయి. కథ వినగానే టైటిల్ సూచించా" అని యశ్ చెప్పారు.దర్శకురాలు గీతూమోహన్ దాస్ గురించి యశ్ మాట్లాడుతూ.. ఆమెకు మాస్ పల్స్ తెలుసన్నారు. గతంలో ఆమె ఎలాంటి సినిమాలు చేశారు.. వాటి ఫలితమేంటి? అన్నది కాకుండా ప్రస్తుతం ఏం కథ చెప్పాలనుకుంటున్నారనేది మాత్రమే చూసినట్లు చెప్పారు. ఆమెకు సినిమా అంటే ప్యాషనని.. ఈ చిత్రంలో మహిళా పాత్రలు చాలా ఉన్నాయని వెల్లడించారు. ఆ హీరోయిన్ల వివరాలు త్వరలోనే ప్రకటిస్తామన్నారు. యశ్ 19వ చిత్రంగా 'టాక్సిక్' తెరకెక్కుతుంది. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. 'కేజీఎఫ్' సిరీస్ విజయాల తర్వాత యశ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ నటి తారా సుతారియా ఇందులో భాగమయ్యారంటూ జరిగిన ప్రచారాన్ని తాజాగా ఆమె ఖండించారు. కథానాయికలుగా నలుగురు హీరోయిన్ల పేర్లు తెరపైకి వచ్చాయి. మొదట సాయిపల్లవి పేరు బయటకురాగా.. ఆ తర్వాత కరీనాకపూర్, శ్రుతిహాసన్, కియారా అద్వాణీల పేర్లు వైరలయ్యాయి. ఈవిషయంలో అధికారిక ప్రకటన కోసం అందరూ ఎదురుచూస్తున్నారు.

## 'వార్ 2'లో పఠాన్?

సినిమాల్లో హీరోగా తన యాక్షన్‌తో ప్రేక్షకులను అదరగొడుతూనే.. అవకాశం వచ్చినప్పుడల్లా అతిథి పాత్రల్లో తళుక్కున మెరుస్తూ సందడి చేస్తుంటారు అగ్రకథానాయకుడు షారుక్ ఖాన్. ఇప్పుడాయన 'వార్ 2'లో ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న చిత్రమిది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. "ఎన్టీఆర్, హృతిక్ కాంబినేషన్‌లో తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. దీనికి అనుగుణంగానే భారీ యాక్షన్ సీక్వెన్స్, కొన్ని సర్‌ప్రైజ్‌లను ప్లాన్ చేస్తుంది చిత్రబృందం. ఇందులో భాగంగా షారుక్ ఈ చిత్రంలో 'పఠాన్' తరహా పాత్రలో మరోసారి సందడి చేయడానికి సన్నద్ధమయ్యారు. తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణను కూడా ప్రారంభించారాయన" అని షారుక్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి ఈ చిత్రంలో ఈ ముగ్గురు అగ్రతారల సందడి చూడాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే.



## బిగ్ బాస్ గంగవ్వపై కేసు నమోదు. ఎందుకంటే.?

మైవిలేజ్ షో ద్వారా గుర్తింపు పొందిన గంగవ్వ చిక్కుల్లో పడ్డారు. గంగవ్వతో పాటు యూట్యూబర్ రాజు పై అటవీశాఖ అధికారులు, వైల్డ్ లైఫ్ కింద జగిత్యాల ఎఫ్.ఆర్. ఓ. పద్మారావు కేసు నమోదు చేశారు. 2022 సంవత్సరం మే నెలలో తీసిన ఓ వీడియోలో చిలుకను ఉపయోగించడంపై వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్ఓ పద్మారావు తెలిపారు యూట్యూబ్ ప్రయోజనాల కోసం చిలుకను హింసించి వన్యప్రాణుల రక్షణ చట్టాన్ని ఉల్లంఘించారని ఫిర్యాదు చెయ్యడంతో జంతు సంరక్షణ కార్యకర్త గౌతమ్ ఈ ఘటనపై ఫిర్యాదు చేసినట్లుగా ఎఫ్ఆర్ఓ తెలిపారు. దీంతో యూట్యూబర్ రాజు 25వేల రూపాయల ఫైన్ కట్టారు.బిగ్ బాస్ గంగవ్వపై కేసు నమోదు.ఈ విషయం ఇలా ఉండగా ప్రస్తుతం గంగవ్వ ప్రముఖ ఎంటర్టైన్మెంట్ చానెల్ అయిన స్టార్ మాలో ప్రసారం అవుతున్న తెలుగు బిగ్ బాస్ 8 వ సీజన్ లో కంటెస్టెంట్ గా పాల్గొంటుంది. గతంలో 4 వ సీజన్ లో కంటెస్టెంట్ గా పాల్గొని ఆడియన్స్ ని బాగానే ఆకట్టుకోగా ఈసారి వైల్డ్ కార్డ్ ఎంట్రీ ద్వారా కంటెస్టెంట్ గా ఎంట్రీ ఇచ్చింది.



## నటన జీవితంలో ఓ భాగం మాత్రమే



బాలీవుడ్‌లో అత్యంత ప్రేక్షకాదరణ పొందిన నటీమణుల్లో కాజోల్ ఒకరు. 90ల నాటి ఈ స్టార్ ఇప్పటికీ చిత్రాలు, సిరీస్‌లతో అలరిస్తున్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. సినిమాల మధ్యలో గ్యాప్ ఎక్కువ తీసుకోవడానికి గల కారణాన్ని వివరించారు. ఇండస్ట్రీలో తనలా ఏ హీరోయిన్ కూడా గ్యాప్ తీసుకోలేదని వెల్లడించారు.'నా ఫిల్మోగ్రఫీ చూస్తే.. ఇండస్ట్రీలో చాలా తక్కువ పని చేసిన నటిని నేనే అనిపిస్తుంటుంది. జీవితంలో నటన ఓ భాగమే కానీ.. నటనే జీవితం కాదని మా అమ్మ ఎప్పుడూ చెబుతుండేది. అందుకే కొన్ని రోజులు సినిమాలు చేసి మధ్యలో విరామం తీసుకున్నాను. పిల్లలకు అవసరమైనప్పుడు వాళ్లతో ఉన్నాను. మళ్లీ సినిమాల్లో నటించడం మొదలుపెట్టాను. కెరీర్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు నన్ను ఎంతోమంది అభిమానులు ఆదరిస్తున్నారు. వారందరికీ రుణపడి ఉంటాను. కావాలనుకున్నప్పుడు వర్క్ చేస్తాను. కుటుంబానికి అవసరమైనప్పుడు విరామం తీసుకొని వాళ్లతో ఉంటాను' అని చెప్పారు.ప్రస్తుతం కాజోల్ నటించిన 'దో పత్తి' విడుదలకు సిద్ధంగా ఉంది. అక్టోబర్ 25 నుంచి ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. శశాంక చతుర్వేది దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కృతిసనన్ తొలిసారిగా ద్విపాత్రాభినయంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఇందులో కవలలైన అక్కాచెల్లెళ్ల గురించిన రహస్యాలను వెలికితీసే పోలీసు అధికారి పాత్రలో కనిపించనుంది కాజోల్. 'బ్లూ బటర్ ఫ్లై ఫిల్మ్స్' పతాకంపై కృతి నిర్మిస్తున్న తొలి చిత్రమిది. షహీర్ షేక్, తన్వీ అజ్మీ, బ్రిజేంద్ర కాలా కీలకపాత్రలు పోషించారు.